

www.suryaa.com

ఏలూరు జిల్లా
పశ్చిమ
గోదావరి జిల్లా

ఆదివారం,10 ఆగస్టు 2025

8 పేజీలు


### ఆదివాసీల అభివృద్ధి

# కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం







- ఎన్డీఏ ప్రభుత్వంలో గిరిజనులకు స్వర్ణయుగం
- వేడుకల్లో జడ్పి చైర్ పర్సన్ పద్మశ్రీ ,ఎమ్మెల్యే బాలరాజు

**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్:** గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకుని ప్రతీ గిరిజనుడు సామజిక,ఆర్ధిక, రాజకీయంగా అభివృద్ధి బాటలో నిలవాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. బుట్టాయిగూడెంలో శనివారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. కోట రామచంద్ర పురంలోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పెరేడ్ గ్రౌండులో నిర్వహించిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ చైర్ పర్సన్,ఎమ్మెల్యే చిర్రి బాలరాజులు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. డా.బి.ఆర్. అంబేద్కర్, కొమరం భీమ్, బిర్సా ముండా, సోయం గంగులు, పూరెం సింగరాజు దొర,కారుకొండ సుబారెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాతీయ జెండాను ఐటిడిఏ పీవో కె.రాములు నాయక్ ఆవిష్కరించగా, ఆదివాసీ జెండాను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ ఎక్కడో మారుమూల అటవీ ప్రాంతాలలో జీవనంసాగించే గిరిజనులకు చేయూతను అందించి సమాజంలో వారికి ప్రత్యేక గుర్తింపు లభించేలా విద్య,ఉద్యోగ,రాజకీయ రంగాలలో అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. శాసనసభ్యులు చిర్రి బాలరాజు మాట్లాడుతూ అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు,ఆడపడుచులకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు.పోలవరం నిర్వాసితులకు రూ.1000కోట్లుఅంద జేశామన్నారు. గిరిజన సంక్షేమానికి, అభివృద్ధి ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలన్నారు. సీసీ రహదారులు,డ్రైనేజీకి రూ 57 కోట్లు,ఆర్ అండ్ బి రహదారులకు రూ 15 కోట్లు పనులు పూర్తి చేశామని సీసీ రహదారులకు మరో రూ 15 కోట్లతో శ్రీకారం చుట్టనున్నామని అన్నారు.నియోజక వర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 154 మందికి రూ.4 కోట్ల 20 లక్షలు సాయాన్ని నిరుపేదలకు అందించామని అన్నారు. అసెంబ్లీలో జీవో నెంబరు 3 గురించి మాట్లాడింది మొట్టమొదటి ఎమ్మెల్యే నేనే అని అన్నారు.ఎన్డీఏ ప్రభుత్వంలో ఏజెన్సీ గిరిజన

- తరువాయి 2లో..



## కేంద్రమంత్రి వర్మ ఇంట వైభవంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

**భీమవరం,మేజర్‌న్యూస్ :** సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ నివాసంలో శనివారం రాఖీ వేడుకలు ఘనంగా జరిగాయి. రాఖీ పండుగ సందర్భంగా ఆయన ముగ్గురు సోదరీమణులు కలిదిండి అన్నపూర్ణ దేవి,మంతెన నాగ శిరోమణి, వేగేశ్న జ్యోతి లక్ష్మి సంప్రదాయ బద్ధంగా తమ సోదరుడికి రాఖీ కట్టి,స్వీట్లు తినిపించారు. అనంతరం కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ తమ సోదరీమణులకు నూతన వస్త్రాలను బహూకరించి,వారి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, 'రాఖీ పౌర్ణమి కేవలం ఒక పండుగ మాత్రమే కాదుఅని, మన సంస్కృతిలో అంతర్భాగమైన కుటుంబ విలువలకు, సోదర సోదరీమణుల మధ్య ఉన్న అమూల్యమైన బంధానికి నిలువెత్తు సాక్ష్యం' అని పేర్కొన్నారు. పవిత్రమైన రాఖీ పౌర్ణమి రోజున తనముగ్గురు అక్కల ఆశీర్వాదం పొందడం ఆనందంగా

- తరువాయి 2లో..

## గిరిజనేతరులు భూములు ఆక్రమించుకోవడం చట్ట విరుద్ధం

- కన్నుల పండుగగా ఆదివాసీ దినోత్సవం




**వేలేరుపాడు, మేజర్‌న్యూస్ :** ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయకపోవడంతో ఏజెన్సీలోని షెడ్యూల్డు భూములను గిరిజనే తరులు దర్జాగా ఆక్రమిస్తూ 1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్,ఏటీఏ,ఏవి యస్‌పి ఆదివాసీ సంఘాల నాయకులు ఆరోపించారు. శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు.ముందుగా ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబించేలా కళాకారుల నృత్యాలతో ప్రధాన సెంటర్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆదివాసీ జెండాను ఆవిష్కరించి,ఆదివాసీ అమర వీరుల చిత్రపటాలకు పూల మాలలు

- తరువాయి 2లో..

## ఆర్థికంగా,సామాజికంగా బలపడాలంటే విద్యతోనే సాధ్యం

- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి





**భీమవరం,మేజర్‌న్యూస్ :** ప్రపంచ ఆదివాసుల దినోత్సవం సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమమునకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పేదరికం నుండి బయటకు రావాలంటే ఒక్క విద్యతోనే సాధ్యమని అన్నారు. గిరిజనుల జీవన విధానమును నేను చాలా దగ్గర నుంచి చూడటం జరిగినదని అన్నారు. రంపచోడవరంలో పని చేసినప్పుడు గిరిజనులకు న్యాయమైన విద్య, వైద్యంతో పాటు వారికి జీవనోపాధి

- తరువాయి 2లో..

## గంజాయితో పట్టుబడిన ముగ్గురు యువకులు

- రిమాండ్‌కు తరలింపు - 2.5కిలోల గంజాయి స్వాధీనం



**కైకలూరు,మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ ఆదేశాలతో డి.ఎస్.పి పర్యవేక్షణలో రూరల్ సీఐ రవికుమార్ ఎస్సై రాంబాబు ఆధ్వర్యంలో వారి సిబ్బందితో కలసి రాబట్టిన సమాచారం మేరకు కైకలూరు మండలం ఆలపాడు గ్రామం వద్ద మధ్యవర్తుల సమక్షంలో వాహన తనిఖీ నిర్వహించగా, ముగ్గురు వ్యక్తులు గంజాయితో పట్టుబడ్డారు. పట్టుబడిన ముద్దాయిల వివరాలుబీ ఎ-1 గురివెల్లి బాలసాయి రామిరెడ్డి 27 కైకలూరు మండలం భుజబలపట్నం శివారు,సింగాపురం

- తరువాయి 2లో..

# మైదాన ప్రాంతంలోని గిరిజనుల అభివృద్ధికి మినీ ఐటీడీఏ ఏర్పాటు చేయాలి





**ఏలూరు,మేజర్ న్యూస్ :** బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ గిరిజన దినోత్సవంను స్థానిక ఆర్ అండ్ బి కార్యాలయం నందు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన హక్కుల కోసం సంక్షేమం కోసం పోరాడుతున్న అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ నాయకులు దేవరకొండ వెంకటేశ్వర్లును,విద్యార్థులకు చేతక్ మెరిట్ స్కాలర్ షిప్ ను ఇచ్చి ప్రోత్సహిస్తున్న బంజారా నాయకులు జరభల కృష్ణా నాయక్, బోడా విమలావతి బాయి లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు ధరావత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ మైదాన ప్రాంతంలోని గిరిజనుల అభివృద్ధి కోసం మినీ ఐటీడీఏను ఏర్పాటు చేయాలని అన్నారు. 500 జనాభా దాటిన గిరిజన గ్రామాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరారు. సంఘ నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలను కలుపుతూ పోలవరం కేంద్రంగా గిరిజన జిల్లాను ఏర్పాటు చేయాలని కోరారు. పోలవరం శాసనసభ నియోజకవర్గంలో ఉన్న టి.నర్సాపురం మండలానికి గిరిజన ప్రాంత హోదాను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన ఉద్యోగుల జాతీయ నాయకుడు దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొమురం భీమ్,బిర్సా ముండా,ఏకలవ్య,సేవాలాల్ మొదలైన గిరిజన వీరుల పోరాటాలు,త్యాగాల స్ఫూర్తితో గిరిజనులు చైతన్యవంతులై విద్యా వైద్య ఆర్థిక రంగాల్లో అభివృద్ధిని సాధించాలని పిలుపునిచ్చారు.

# గంజాయితో పట్టుబడిన ముగ్గురు యువకులు

మొదటిపేజీ తరువాయి

గ్రామానికి చెందిన వ్యక్తి ఇతను వైజాగ్‌లో హోటల్ మేనేజ్మెంట్ లో డిగ్రీ చదువుచున్న సమయంలో గంజాయి త్రాగటానికి అలవాటుపడి. గంజాయిని విక్రయిస్తూ గతంలో అనకాపల్లి జిల్లా వాతవరం పోలీస్ లకు 2022 సం.లో పట్టుబడి జైలుకు వెళ్ళడు. ఇతను ఎటువంటి ఉద్యోగం చేయకుండా, చెడు అలవాట్లకు అలవాటుపడి తన స్నేహితులతో కలిసి మరలా గంజాయి విక్రయిస్తున్నాడు. ఎ-2 ముద్దాయి జయమంగళ లక్ష్మీనారాయణ 26 ఇదే మండలానికి సంబంధించిన చటకాయ గ్రామానికి చెందిన వ్యక్తి ఇతను డిగ్రీ వరకు చదువుకొని ప్రస్తుతం కూలి పనులు చేసుకొంటూ గంజాయి త్రాగటానికి అలవాటుపడి తన స్నేహితులతో కలిసి గంజాయి విక్రయిస్తున్నాడు.

ఎ-3 నరహరిశెట్టి వెంకట అవినాష్ 27 కైకలూరు వెలమపేటకు సంబంధించిన వ్యక్తి ఇతను చెన్నైలో బిటెక్ చదువుతూ గంజాయి త్రాగటానికి అలవాటుపడి, చదువు మధ్యలో ఆపేసినాడు ప్రస్తుతం లారీ ట్రావెల్స్‌లో మధ్యవర్తిగా పని చేస్తూ తన స్నేహితులతో కలిసి గంజాయి విక్రయిస్తున్నాడు. అలపాడు గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేయుచుండగా ముగ్గురు ముద్దాయిలు మోటార్ సైకిల్ పై వస్తూ ఎస్సైకి పట్టుబడ్డారు. వారి వద్ద నుండి మొత్తం 2.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకోని,పై ముద్దాయిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయదమైనది. ముద్దాయిలను రిమాండ్ కు తరలిస్తామని తెలిపారు.

## ఇద్దరు స్నేహితుల మధ్య వివాదం - కత్తితో దాడి

**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఇద్దరు స్నేహితుల మధ్య మాట పెరిగి ఒక స్నేహితుడు మరొకటిపై కత్తితో దాడి చేశాడు ఈ ఘటన ఏలూరు రూరల్ మండలం హనుమాన్ నగర్‌లో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. కృష్ణ వరపు ఆంజనేయ వరప్రసాద్ పేరాడ శివాజీలు చిన్ననాటి స్నేహితులు. ఒకే ప్రాంతానికి చెందినవారు కాగా వీరి మధ్య చిన్నపాటి వివాదం,తలెత్తింది దీంతో శివాజీ , ప్రసాద్ పై కత్తితో దాడి చేశాడు. ప్రసాద్ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు

## కనుల పండువగా జగన్మోహిని కేశవస్వామివారి మాస కళ్యాణం

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి మాస కల్యాణోత్సవం శనివారం ఉదయం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కంకణ ధారణ, మధుపర్క ప్రాసర, కన్యాదా నం, మధుపర్కాలు, సూత్ర యజ్ఞోపవీత ధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలను అర్చకులు రమణీయంగా నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొని కార్యక్రమాలను తిలకించి పులకిం చారు. స్వామివారిని దర్శించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

# జోరు వానలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌లా ఎమ్మెల్యే ప్రభాకర్





**దెందులూరు,మేజర్ న్యూస్ :** ప్రజలకు సమస్య ఉంటే వాటి పరిష్కారం కోసం తానే తొలి సేవకుడిగా మారతాననే విషయాన్ని మరోసారి నిరూపించుకున్నారు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్. శనివారం ఉదయం జోరు వాన కురుస్తున్న సమయంలో దెందులూరు మండలం సోమవరపాడు వద్ద అటుగా ప్రయాణిస్తున్న ఎమ్మెల్యేకి అక్కడ రోడ్ల మీద ఉన్న గుంతల్లో నీరు పేర్కొని, మోటారు బైక్‌లు కార్లు లారీలు అస్తవ్యస్తంగా నిలిచిపోయి అక్కడ ట్రాఫిక్ ఆగిపోయి ప్రజలు ఇబ్బంది పడడం గమనించారు. వెంటనే తన కాన్వాయ్ నుంచి దిగిన ఎమ్మెల్యే తానే ఒక ట్రాఫిక్ పోలీస్‌గా మారి రోడ్డుకు మధ్యలో నిలబడి ముందుగా భారీ వాహనాలను పక్కకు తప్పించి, ద్విచక్ర వాహనాలను ఒక వైపుగా పోనివ్వడం అదేవిధంగా ఎదురుగా వచ్చే వాహనాలను క్రమబద్ధీకరిస్తూ దాదాపు 20 నిమిషాల పాటు అక్కడ సమయాన్ని కేటాయించారు. పూర్తిగా ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

అదేవిధంగా ఇంతలా ప్రజలు ఇబ్బంది పడడానికి కారణమైన గుంతలను సైతం తన కార్యాలయ సిబ్బంది ద్వారా ఫోటోలు తీయించి వాటిని ప్రాజెక్టు డైరెక్టర్, నేషనల్ హైవే అథారిటీస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సత్వరమే రోడ్ల మరమ్మతులు చేపట్టాలని చెప్పి ఆదేశాలు జారీ చేశారు.

# ఆదివాసీల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

మొదటిపేజీ తరువాయి

ప్రాంతాలను కనీవినీ ఎరుగనిరీతిలో అభివృద్ధి చేస్తానన్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు చిర్రి బాలరాజు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీని దుశ్శాలువా, మెమెంటోతో సత్కరించారు. గిరిజన మండలాల్లో ఉత్తమ సేవలందించిన సిబ్బందిని జిల్లా పరిషత్ చైర్ పర్సన్,ఎమ్మెల్యే సన్మానించారు ఈ సందర్భంగా గిరిజన విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన గిరిజన సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ఏపి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఐ.కిషోర్, గిరిజన సంక్షేమ సంక్షేమ డిడి యన్.శ్రీవిద్య, ఐసిడియస్ పిడి పి.శారద, మండల వివిధ శాఖల అధికారులు, ఐటిడిఏ అధికారులు, ఉద్యోగులు,యం.పి.పి కారం శాంతి, జడ్పిటిసి సభ్యురాలు మొడియం రామ తులసి,గ్రామ సర్పంచ్ ఉయికే బోజ్జియ్య ,జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవి కుమార్,వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు,గిరిజన నాయకులు,ఆదివాసీ ప్రజలు, వివిధ పాఠశాలలు, కళాశాలలు విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి వర్మ ఇంట వైభవంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

మొదటిపేజీ తరువాయి

ఉందన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి ఒక్కరూ సోదర సోదరీమణుల బంధాన్ని మరింత బలపరచుకోవాలని శ్రీనివాస వర్మ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఆకివీడు మండల అధ్యక్షురాలు నాగమణి తోపాటు పలువురు మహిళలు శ్రీనివాస వర్మకు రాఖీలు కట్టారు.భూపతిరాజు వెంకటేశ్వరి దేవి, కలిదిండి వినోద్ వర్మ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

# గిరిజనేతరులు భూములు ఆక్రమించుకోవడం చట్ట విరుద్ధం

మొదటిపేజీ తరువాయి

వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజనేతరుల వలసలను నిర్మూలించాలని, భూములు కబ్జా చేసే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన హక్కులు,సంస్కృతిల పరిరక్షణ కోసం ఐక్యరాజ్య సమితి సూచనలతో జాతీయ ఎస్టి కమిషన్,మానవ హక్కుల కమిషన్‌లు దృష్టిసారించి నక్సలైట్ల పేరుతో కేసులు పెట్టీ వేధింపులకు గురవుతున్న ఆదివాసీ నాయకులను విముక్తులు చేయాలని కోరారు .కొమరం భీం,పూరి సింగరాజు,భీర్సా వంటి అమరుల స్ఫూర్తితో భవిష్యత్తు తరాలకోసం ఐక్యతతో చట్టాల పటిష్టత కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జడ్పీటిసి గుజ్జా రామలక్ష్మి, సోడెం రాజు, చిర్రి దేవరాజు,ఇర్పా సూర్య చంద్రం,పాయం రమేష్, సోడే సీతారామయ్య, ఊకె ముత్యాల రావు,పొట్ల మోహన్ దొర,బంధం వీర బాబు,కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికంగా,సామాజికంగా బలపడాలంటే విద్యతోనే సాధ్యం

మొదటిపేజీ తరువాయి

కల్పించేలా కృషి చేయడం జరిగిందన్నారు. మీరందరూ మెరుగైన విద్యనభ్యసించుటకు సుదీర్ఘ ప్రాంతాల నుండి వచ్చిఇక్కడ హాస్టల్లో ఉండి చదువు కుంటున్నారని, మంచిగా చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని అన్నారు. బ్రిటిష్ పాలనలో గిరిజనులపై చేసిన అరాచకాలను ఎదిరించి నాయకత్వం వహించిన కొమరం భీం ధైర్య సాహసాలను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులతో అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని మీరందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి డి.పుష్పరాణి,వసతి గృహం అధికారి డి.శ్రీనివాస్, సిబ్బంది జి.దుర్గారావు,బి.కమల కుమారి,శ్యామ్,శరత్,హాస్టల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మధ్య ఆత్మీయత అనుబంధాన్ని పెంచేది రక్షాబంధన్





**జీలుగుమిల్లి, మేజర్‌న్యూస్:** సమరసత సాధనకు, వాడ వాడల్లోనూ హిందూ ధర్మ సంస్కృతి విశిష్టతను చాటుటకు ప్రజల మధ్య ఆత్మీయత అనుబంధాన్ని పెంచుటకు రక్షాబంధన్‌ని ఆదర్శంగా తీసుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ ప్రముఖ్ పసుపులేటి కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. శనివారం రక్షాబంధన్ ఉత్సవ సందర్భంగా ఎస్ఎస్ఎఫ్ కార్యకర్త రేపాక గోపాలం అధ్యక్షతన రక్షాబంధన్ ఉత్సవం స్థానిక శ్రీ కోదండ రామాలయంలో జరిగింది.ఒకరికొకరు రాఖీలు కట్టుకుని, "నేను నీకు రక్షా నువ్వు నాకు రక్ష మన అందరూ ఈ దేశానికి ధర్మానికి రక్ష" గా నిలుద్దాం అని ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు. అలాగే గ్రామ గ్రామాన వీధి వీధిన ఆడపడుచులు తన తోడబుట్టిన సోదరులకు రాఖీలు కట్టి ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని దీవించారు. రాఖీ కట్టిన సోదరీమణులకు వారికున్నంతలో ఆడపడుచుకి ఇచ్చి కుటుంబ మంతా ఆనందాత్సవాల నడుమ రాఖీ పండుగను జరుపుకున్నారు. హిందూ పండగ అంటే కుటుంబమంతా గ్రామమంతా ఒక్కటిగా కలిసి చేసుకునే ధర్మం అని పలువురు అంటున్నారు. ఈ కార్యక్రమంలో బొంతు రామకృష్ణ, కక్కిరాల అప్పారావు, శ్రీనివాస గాంధీ, కక్కిరాల సురేష్, కోలా లక్ష్మణ్ గంధం గోతియ్య, నాగేశ్వరరావు వేదల జనార్దన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ నేత గొర్రెల శ్రీధర్ ఇంటి వద్ద రక్షాబంధన్ వేడుకలు





**తాడేపల్లిగూడెం, మేజర్‌న్యూస్:** తాడేపల్లిగూడెం 17వ వార్డులో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ ఇంటి వద్ద మహిళలు పెద్ద ఎత్తున రక్షాబంధన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ కౌన్సిలర్లు వార్డులలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్షాబంధన్ కట్టి గొర్రెల శ్రీధర్ కు అభినందనలు ఆశీస్సులు అందజేశారు. అందరికీ చీర సారి ఇచ్చి సత్కరించారు. సమస్య ఏదైనా తనకు నేను అండగా ఉంటాను అంటూ పట్టణంలో తలలో నాలుక వ్యవహరిస్తూ ఉంటారని అందుకనే కౌన్సిలర్ లు సైతం రక్షాబంధన్ వేడుకలో పాల్గొన్నారని మాజీ కౌన్సిలర్ సుభద్ర, కొల్లి రమాదేవిలు తెలియజేశారు.

# టీ షాపు యజమాని పట్నాల నగేష్‌కు శ్రామిక మహిళలు రాఖీ బంధన్



**పెనుమంట్ర, మేజర్‌న్యూస్ :** చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ సీసాలు ఏరుకొని, వాటిని అమ్మడం ద్వారా జీవనం సాగించే కొందరు శ్రామిక మహిళలతో రాఖీ కట్టించుకొని, ఉదారంగా నగదు కానుక ఇచ్చిన ఓ టీ షాప్ యజమాని వైనం ఇది.ఈ సంఘటన మండలం లోని మార్టేరు గ్రామం కోడేరు రోడ్డు చర్చ్ సెంటర్‌లో జరిగింది.శనివారం రాఖీ పండుగ సందర్భంగా స్థానిక టీ షాప్ యజమాని పట్నాల నగేష్ కు కొంతమంది శ్రామిక మహిళలు వచ్చి రాఖీలు కట్టారు.కాగా, ఈ ప్రాంతంలో ఈ మహిళలు ప్రతీ రాఖీ పండుగ రోజున వచ్చి ఇలా ఆత్మీయంగా తన చేతికి రాఖీలు కట్టి వెళ్తుంటారని ఆయన అన్నారు.

# ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



**నరసాపురం, మేజర్‌న్యూస్ :** నియోజకవర్గ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్షునిగా కేతినీడి పాండు రంగారావు (రంగా),కార్యదర్శిగా వేండ్రపు ఆనంద కుమార్,లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు అధ్యక్ష కార్యదర్శులుగా కొనసాగిన టి ఇజ్రాయెల్, నాయుడు మారుతీరావులతోపాటు ఇతర పాలకవర్గం కూడా రాజీనామా చేయటంతో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కరింశెట్టి శ్రీనివాస్, బొడ్డు కృష్ణ భగవాన్, చెరుకూరి రాజేష్, సహాయ కార్యదర్శులుగా కడిమి తాతారావు (నాని), సీమకుర్తి బాలాజీ, అనంత బాబి, ఇంటి బాలకృష్ణ (పండు), కార్యవర్గ సభ్యులుగా వాసా ఈశ్వరరావు, పోతుమూడి తాతాజీ, కె ఉమాశంకర్, టి జీవన్ ఎన్నికయ్యారు.

# నాయుడు నివాసంలో రాఖీ సందడి



**నరసాపురం, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతి రాజ రామ్మోహన్ నాయుడు నివాసంలో శనివారం రాఖీ సందడి నెలకొంది. రెండు నెలల పాటు ఉద్యోగం రీత్యా అమెరికాలో ఉండి రాఖీ పండుగ రోజున ఆయన నరసాపురం విచ్చేశారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మహిళలు, అభిమానులు నాయుడు నివాసానికి చేరుకుని రాఖీలు కట్టారు. ఉదయం నుండి రాత్రి వరకు ఆయన నివాసంలో సందడి కొనసాగింది. ఈ సందర్భంగా నాయుడు సోదరి నిమ్మకాయల నీలిమ దేవి రాఖీ కట్టారు.

# జనసేన కార్యాలయంలో రాఖీ వేడుక



**నరసాపురం,మేజర్‌న్యూస్:** స్థానికజనసేన పార్టీ కార్యాలయంలో శనివారం రాఖీ పండుగ నిర్వహించారు. ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్,ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు వారితో కలిసి రాఖీ వేడుకల్లో పాల్గొన్నారు. జనసేన మహిళ నాయకులు, ఇతరులు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గం జనసేన, టిడిపి, బిజెపి నాయకులు జనసైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# భవనిర్మాణ కార్మిక సంఘం పూర్వాధ్యక్షులు గురువు సూర్యరావు మృతి



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** తాడేపల్లిగూడెం భవన నిర్మాణ కార్మిక సంఘం పూర్వాధ్యక్షులు గురువు సూర్యరావు శుక్రవారం అర్ధరాత్రి కన్నుమూశారు. తాడేపల్లిగూడెం ప్రాంతంలో భవన నిర్మాణరంగంలో ఎంతో మంది శిష్యులను తయారు చేసి భవన నిర్మాణ కార్మిక సంఘంలో అధ్యక్షులుగా కార్మికులకు శ్రేయస్సు భద్రత సంక్షేమం కోసం ఎన్నో సేవలు అందించిన మహోన్నత వ్యక్తి గురువు సూర్యరావు అని సోమసుందర్ అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పోలీరాతి ఆదినారాయణ, ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియా అధ్యక్ష కార్యదర్శులు ఓ వి రాజు, మందలపర్తి హరీష్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే లక్ష్మణరావు తాడేపల్లిగూడెం ఏరియా భవన్ నిర్మాణం కార్మిక సంఘం కమిటీ అధ్యక్షులు దువ్వ శ్రీనివాస్ అత్తిలి బాబి, కోడే సాయి, బాలాజీ పలువురు ప్రజాసంఘ నాయకులు సంతాపం తెలియజేశారు.

# రాఖీ పౌర్ణమి సందర్భంగా వెల్లి విరిసిన అక్కా చెల్లెమ్మల అభిమానం





**పెదవేగి,మేజర్ న్యూస్ :** దుగ్గిరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వెల్లి విరిసిన అక్కా చెల్లెమ్మల అభిమానం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కి రాఖీ పౌర్ణమి సందర్భంగా బ్రహ్మ కుమారి సమాజం ప్రతినిధులు, కూటమి మహిళా నాయకులు, నియోజకవర్గ మహిళలు,చిన్నారులు – రక్షాబంధన్ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.ప్రతి ఒక్కరికి చింతమనేని శుభాకాంక్షలు తెలియజేసి కానుకలు అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి మహిళను తన సొంత ఆడపడుచుల భావించి,వారికి ఎల్లవేళల అన్ని విధాల ఒక అన్న లాగ, ఇంటికి పెద్ద కొడుకుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సందర్భంగా సుదూర గ్రామాల నుంచి సైతం కొండంత అభిమానంతో తరలివచ్చి తనకు రక్షాబంధనాన్ని కట్టి సోదర భావాన్ని పంచిన ప్రతి ఒక్కరికి కూడా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళా పక్షపాతిగా సుపరిపాలన కొనసాగిస్తుందని దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించడం,తల్లికి వందనం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ కూడా తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు అందించడం, మరోవైపు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని సైతం అందించడం,ఇటువంటి అనేక సంక్షేమ పథకాలను మహిళల సాధికారత కోసం,వారి అభ్యున్నత కోసం,వారి సంక్షేమం కోసం,కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మహిళకు కూడా తాను ఒక అన్నలాగా ఆ ఇంటికి పెద్దకొడుకు లాగా ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు.

# అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్






– ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు రాఖీలు కట్టిన సోదరీమణులు

**తణుకు,మేజర్‌న్యూస్ :** అన్న చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీకగా రక్షా బంధన్ నిలుస్తుందని తణుకు శాసన సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు.రాఖీ పర్వదినం పురస్కరించుకొని శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటుచేసిన రక్షాబంధన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ శారధ్యంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నట్లు చెప్పారు. ప్రతికుటుంబంలో ప్రతి కుటుంబంలో పెద్ద అన్నయ్యాలా,పెద్దకొడుకుగా సంక్షేమ ఫలాలు అందిస్తూ తల్లికి వందనం,మహిళలకు ఉచిత బస్ ప్రయాణం ఆగస్టు 15నుండి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. సోదరా భావంతో మహిళలకు సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే అని అన్నారు. ఈ సందర్బంగా మహిళలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసారు. కార్యక్రమంలోకూటమినాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# నల్లీ క్రిక్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం : విప్ నాయకర్



**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్ :** మండలంలోని చిన మైనవాని లంక గ్రామంలో గల నల్లీ క్రిక్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం నల్లీ క్రిక్ ప్రాంతాన్ని పరిశీలనకు వెళ్లిన ఎమ్మెల్యే నాయకర్ ఆర్ అండ్ బి అధికారులతో నల్లీ క్రిక్ ప్రాంతంలో వంతెన నిర్మాణం పనుల జాప్యం పై కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా నాయకర్ మాట్లాడుతూ, నల్లీ క్రిక్ ప్రాంతంలో తరుచు ప్రమాదాలు జరగడం బాధాకరం అని అన్నారు.ఈ ప్రాంతంలో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టడానికి తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఇతర అధికారులకు సూచించారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తో నల్లీ క్రిక్ సమస్యపై చర్చించామని, త్వరలో ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణాన్ని చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, రాష్ట్ర మత్స్య సహకార సంఘాల అభివృద్ధి సంస్థ చైర్మన్ కొల్లు పెద్దిరాజు,సర్పంచ్ ఒడుగు ఏసు బాబు, జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు మైల వసంతరావు, టిడిపి నర్సాపురం మండల అధ్యక్షులు వాతాడి ఉమ, ఆర్ అండ్ బి డి.ఇ.జి.వి.ఎస్ కిరణ్ కుమార్, తహసీల్దార్ అయితం సత్య నారాయణ, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భూమి ఉంటేనే గిరిజనుడికి మనుగడ





– ఆదివాసి సేన రాష్ట్ర అధ్యక్షులు మడకం వెంకటేశ్వరరావు

**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** ఏజెన్సీలో భూమి ఉంటేనే గిరిజనలకు మనుగడ ఉంటుంది అని భూమి పొందేందుకు పోరాటాలే శరణ్యమని ఆదివాసి సేన రాష్ట్ర అధ్యక్షులు, గోండ్వానా దండకారణ్య పార్టీ రాష్ట్ర కార్యదర్శి మడకం వెంకటేశ్వరరావు సూచించారు.శనివారం మండలంలోని పీనారాయణపురంలోని తన వ్యవసాయ క్షేత్రంలో నియోజకవర్గంలోని పలు మండలాల గిరిజనుల మధ్య ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆదివాసీ సేన జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం నిర్వహించిన సభకు కుంజా ప్రసాద్ అధ్యక్షత వహించారు.ఈసందర్భంగా మడకం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గిరిజనులకు రాజ్యాంగంలో ఎన్నో హక్కులు చట్టాలను పొందుపరిచారని అవి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. గిరిజనుల అభివృద్ధికి 1/70 చట్టం,పీసా చట్టం ఎంతగానో ఉపయోగపడతాయని వాటి విశిష్టతను తెలియజేశారు. ప్రస్తుత ప్రభుత్వాలు గిరిజనులకు సంక్షేమ పథకాల పేరుతో చిల్లర మెతుకులు జల్లుతున్నారని ఆరోపించారు.గిరిజనులకు కావలసింది చిల్లర మెతుకులు కాదని,ప్రతి కుటుంబానికి భూమి కనీసం నాలుగు ఎకరాలు ఐదు ఎకరాల వరకు భూమిని పంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మన పూర్వీకులు ఆదివాసీ ముద్దుబిడ్డలు కొమరం భీమ్, బిర్సా ముండా, అల్లూరి సీతారామరాజు, రాంజీ గోండు ఇంకా ఎందరో మహానుభావుల పోరాటాలతో గిరిజన చట్టాలు రూపొందించారని ఆచట్టాలను ఉపయోగించుకుని అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. విద్యావంతులైన గిరిజనులు భూ పోరాటాల్లో భాగస్వామిగా ఉండాలని అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి హక్కులు కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోడియం రమేష్, బరగడ బుచ్చమ్మ, కోర్స ప్రసాద్,కణితి ధనలక్ష్మి,కాకి జయరాజు,వంకా ప్రసాద్,మడకం శేషారావు,చినబాబు, కుంజ అజయ్,కనితి ధనలక్ష్మి, కుంజా రామలక్ష్మి, కొమరం పెంటయ్య, వెంకన్న బాబు,ప్రభాకర్, తెల్లం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ విగ్రహం వద్ద చేపట్టిన పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్



**భీమవరం,మేజర్ న్యూస్ :** భీమవరం బాంబే స్వీట్స్ కూడలిలోని గాంధీజీ విగ్రహం వద్ద దాత బాంబే స్వీట్స్ యాజమాన్యం పోతూరి బాపిరాజు చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహం ప్రాంగణంలో లాన్, మొక్కలు ఏర్పాటు,వాటర్ ఫౌంటెన్, పెయింటింగ్, బ్యాక్ డ్రాప్ పనులపై ఆరా తీశారు. ఈనెల 15 నాటికి చేపట్టిన పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంలో బాంబే సీట్స్ యాజమాన్యం దాత పోతూరి బాపిరాజు, తదితరులు ఉన్నారు.

## నల్లి క్రీక్‌లో యువకుడు గల్లంతు



నర్సాపురం రూరల్,మేజర్‌న్యూస్ : మండలంలోని వేములదీవి గ్రామం చిన్నమైనవానిలంక గ్రామం లో శుక్రవారం ముగ్గురు యువకులు నల్లిక్రీక్ వద్దకు వెళ్లగా అందులో ఒకరు కాళ్ళు కడుక్కోవడానికి దిగి కాలుజారి నీటిలోపడిపోగా కొట్టుకుని పోయి మునిగి పోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అతని ఆచూకీ శనివారం వరకు లభించలేదు. నీటిలో పడిపోయిన యువకుడు గట్టెం గణేష్ (19) స్టూడెంట్ అని స్థానికులు చెప్తున్నారు. యువకుడు మృతదేహం కోసం మత్స్యకారులు బృందలుగా గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పొత్తూరి రామరాజు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు మైలా వసంతరావు, తాసిల్దార్ ఐ వివి సత్యనారాయణ తదితరులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. గజ ఈతగాలతో గాలింపు చర్యలు చేపట్టాలని అధికారులను నాయకర్ ఆదేశించారు.

## భక్తులతో పోటెత్తిన చిన్న వెంకన్న ఆలయం

శ్రావణమాసం,శ్రావణ పౌర్ణమి,
శ్రావణ నక్షత్రం,స్వామివారి పుట్టినరోజు శనివారం



**ద్వారకతిరుమల,మేజర్‌న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన చిన్న వెంకన్న ఆలయం భక్తలతో పోటెత్తింది. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారు జన్మించిన రోజు, శ్రావణమాసం, శ్రావణ పౌర్ణమి, శ్రావణి నక్షత్రం, స్వామివారికి ప్రీతికరమైన రోజు శనివారం కావడంతో వేకువజాము నుండి భక్తులు క్యూ లైన్‌లో క్యూలు కట్టారు.శేషాచల కొండ భక్తుల వాహనాలతో కిక్కిరిసింది. కేశఖండన క్యూలైన్లు,టికెట్ కౌంటర్లు, దర్శనం క్యూలైన్లు,అనిమేట్ కళ్యాణమండపం ఆవరణ, ప్రసాదం కౌంటర్లు, నిత్యా అన్నదాన సదనము భక్తులతో పోటెత్తాయి. ఆల య అధికారులు భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు.ఆలయ ఈ ఓ ఎన్ వి సత్యనారాయణమూర్తి అన్ని విభాగాలలో పర్యవేక్షిస్తూ భక్తులకు ఏవిధమైన అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# ఎమ్మెల్యే బడేటికి రాఖీలు కట్టిన అక్కాచెల్లెమ్మలు




**ఏలూరు,మేజర్ న్యూస్ :** వెలకట్టలేని బంధాలను, వదులుకోలేని అనుబంధాలను గుర్తుచేసే మధుర బంధమే రక్షాబంధనమని ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తోబుట్టువుల అనురాగాన్ని చాటుకునే రక్షాబంధన్ రోజున ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని అక్కాచెల్లెమ్మలకు ఎమ్మెల్యే బడేటి చంటి శుభాకాంక్షలు తెలిపారు. రక్షా బంధన్ సందర్భంగా శనివారం ఉదయం నుంచి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పలువురు మహిళలు ఎమ్మెల్యే కి రాఖీలు కట్టి, శుభాకాంక్షలు తెలిపారు. కేక్ లు కట్ చేయించి, స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే కాలంలో కూడా మహిళలందరికీ అన్నగా తోడుగా ఉంటానని భరోసా కల్పించారు. తాను ప్రజాప్రతినిధి అయినప్పటికీ మహిళలకు మాత్రం అన్నగా అండగా ఉండి, వారికి అన్ని మేళ్ళు జరిగేలా తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నగర మహిళా అధ్యక్షురాలు,కార్యదర్శి,వివిధ హెూదాలో ఉన్న మహిళ నాయకురాలు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వర,కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయానికి భూమి పూజ



**ఏలూరు,మేజర్ న్యూస్ :** స్థానిక 18వ డివిజన్ రాజీవ్ గృహకల్ప వద్ద నూతన విఘ్నేశ్వర , కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి). ఈ కార్యక్రమంలో ఈడా చైర్మన్ పెద్ది బోయిన శివప్రసాద్, టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు,డివిజన్ ఇంచార్జ్ గరికముక్క ఆంజనేయులు,ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ,క్లస్టర్ ఇంచార్జ్ మారం హనుమంత రావు,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరుకల సంక్షేమ సేవా సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం



**పాలకోడెరు, మేజర్ న్యూస్:** పాలకోడేరులో శనివారం ఎరుకల సంక్షేమ సేవ సంఘం అధ్యర్యంలో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. ప్రెసిడెంట్‌గా కుర్ర గోవింద్.వైస్ ప్రెసిడెంట్‌గా సాలా చిన్న మెంబెర్స్‌గా బెల్లం కొండా కృష్ణ ,కుతడి కిషోర్, సాలా మాసరియ్య, కుతడి శ్రీను. బండారి సత్తి బాబు, దేవరకొండ బోగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా మానుపటి పెద్దిరాజు లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సాలా మల్లేశ్వర రావు. బెల్లంకొండ చినబాబు,బండి రుద్రయ్య, సాలా పండు,మానుపటి శ్రీను పాల్గొని వారిని అభినందించారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

**ముదినేపల్లి,మేజర్ న్యూస్ :** గుర్తుతెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో మహిళ తీవ్రంగా గాయపడింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముదినేపల్లి మండలం వడాలి గ్రామానికి చెందిన నూలు వెంకట వరలక్ష్మి పెదపాలపర్రు వెళ్లి తిరిగి వస్తుండగా కల్వపూడిసత్రం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని ప్రమాదానికి గురైంది. ఈమెను స్థానికులు 108 వాహనంలో గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వి వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాజ్యసభ సభ్యులు 'పాక 'ను సత్కరించిన బిజెపి శ్రేణులు



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ :** నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 7వ స్నాతకోత్సవం సందర్భంగా తాడేపల్లిగూడెం పట్టణానికి విచ్చేసిన రాజ్యసభ సభ్యులు పాక వెంకట సత్యనారాయణకి ఆహ్వాన పలికిన బిజెపి శ్రేణులు. స్థానిక జీవి మాల్ సెంటర్లో పలువురు బిజెపి నాయకులు స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దువ్వా శీను, బిజెపి రాష్ట్రకౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వరరావు, రాష్ట్ర ఓబిసి సెక్రటరీ అయినం బాలకృష్ణ, సీనియర్ నాయకులు గట్టిం మాణిక్యాలరావు, బిజెపి రాష్ట్ర ఎస్టీ మోర్చా జనరల్ సెక్రెటరీ సింగం జగపతి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్య పాలు : జాన్ వెస్లీ



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** భారతదేశంలో ఎప్పుడు లేని విధంగా ఆంధ్రప్రదేశ్ లో ప్రజాస్వామ్యం అపహాస్య పాలు అయిందని, రెడ్ బుక్కు పేరుతో రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టించి అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని, రాష్ట్ర క్రిస్టియన్, మైనార్టీ సెల్ అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు, ఆయన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యంగా పోలీసు వ్యవస్థను తమ సొంత అవసరాలకు కూ టమీ ప్రభుత్వం వాడుకుంటుందని, న్యాయవ్యవస్థను సైతం పక్కదారి పట్టించే సామాన్యులకు న్యాయం జరగకుండా చేస్తుందని, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఎమ్మెల్యేలు,ఎంపీలు ల్యాండ్, సాండ్,లిక్కర్, పేకాట క్లబ్బులను ఆదాయ వనరులుగా పై దృష్టి పెట్టి ప్రశ్నించే గొంతుకులను అణగార్చాలని చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వినిస్తాన్ బాబు, మద్ద చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు,

## ఆప్కోబ్ చైర్మన్ గన్నికి రాఖి కట్టిన జడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ



ఏలూరు,మేజర్ న్యూస్ : రాఖి పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ఆప్కోబ్ చైర్మన్, జిల్లా టీడీపీ పార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుకి రాఖి కట్టి, సోదర సోదరీ భావాలను పంచుకున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్.

ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి పండుగ భారతీయ సాంప్రదాయంలో సోదర సోదరీల మధ్య ఉన్న అపూర్వ మైన అనుబంధానికి ప్రతీక అని పేర్కొన్నారు. సోదరి కట్టే రాఖీ కేవలం ఒక దారమే కాకుండా, అది ప్రేమ, ఆప్యాయత,రక్షణ, విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. సోదరుడు తన సోదరిని ఎల్లప్పుడూ రక్షిస్తానని ఇచ్చే హామీ,సోదరి ఇచ్చే ఆశీస్సులు కుటుంబ బంధాలను మరింత బల పరుస్తాయని అన్నారు.

## న్యాయ చట్టాలపై కతోలిక న్యాయవాదులతో సమీక్ష




**ఏలూరు, మేజర్ న్యూస్ :** ఏలూరు ఆర్ సి ఎం పీఠం తరపున మోస్ట్ రెవరెండ్ జయరావు పొలిమేర ఆధ్వర్యంలో ఎ పి ఎస్ ఎస్ ఎస్ భవనంలో శనివారం కేథలిక్ న్యాయవాదులతో జూబిలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుండి వచ్చినట్లు 60 మంది న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ ఛైర్మన్ దున్న రాములు, ట్రాన్స్ ఫర్ ఆఫ్ ప్రా పరిటీస్ అనే అంశంపై అనర్గళంగా ఉపన్యాసం చేశారు.

జస్టిస్ భవన జ్యోతి ప్రజ్వలన చేశారు. ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనె సీతారాం శుభాకాంక్షలు తెలిపారు. వికార్ జనరల్ ఫాదర్ బాల, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మనుయేలు, ఫాదర్ కుమార్, ఫాదర్ జాకబ్, ఫాదర్ బాల స్వామి ఈ కార్యక్రమం నిర్వహించారు.

## పీఎం సోలార్ ఘర్ సద్వినియోగం చేసుకోండి



**కొయ్యలగూడెం రూరల్ ,మేజర్ న్యూస్ :** బడుగు బలహీన వర్గాల వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందజేస్తున్న ఉచిత సోలార్ యూనిట్లు ప్రతి ఒక్కరు ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి చెందినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పరింపుడి గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి ఒక ప్రకటన ద్వారా తెలిపారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఉన్న ఎస్సీ ఎస్టీలకు ఉచితంగా పీఎం సోలార్ ఘర్ పథకం భాగంగా ఉచితంగా యూనిట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తునయ్యాని తెలియజేశారు. సొంతిల్లు కలిగిన ప్రతి ఒక్కరు ఈ పథకానికి అర్హులనీ ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు సుమారు రెండు లక్షల రూపాయల విలువ గల రెండు కేవి సోలార్ విద్యుత్ ను అందజేస్తుందని అన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డు ,బ్యాంక్ పాస్ బుక్,కరెంట్ బిల్లు, వంటివి జిరాక్సులు విద్యుత్ శాఖ అధికారులకు అందజేయాలని తెలియజేశారు.

## వైభవంగా రక్షా బంధన్ వేడుకలు



**పాలకొల్లు ,మేజర్ న్యూస్:** ఆహ్వానం హెూటల్‌లో రాఖీ పండుగ సందర్భంగా అక్కా తమ్ముడు, అన్నా చెల్లెళ్ళలకు రాఖీ కట్టి మీరు నాకు రక్ష, నేను మీకు రక్ష అని ప్రేమానురాగాలు తెలియ చేస్తూ శుభాకాంక్షలు తెలియజేసిన న్యాయ వాది వైఎస్ఆర్ సీపీ స్టేట్ మహిళా విభాగం ప్రధాన కార్య దర్శి కర్రా జయ సరిత,ఈ సందర్భంగా రాఖీ కట్టి అందరికీ విందు ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమంలో ముచ్చర్ల శ్రీ రామ్,స్టేట్ ప్రచార కమిటీ జనరల్ సెక్రటరీ పేచెట్టి కృష్ణాజీ జిల్లా ఉపాధ్యక్షులు జోగాడ ఉమా మహేశ్వర రావు ,జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు వీరా మల్లిఖార్జున, జిల్లా యూత్ జనరల్ సెక్రటరీ దేవా రాజేష్ , వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు మామిడి శెట్టి చిట్టిబాబు , శివ కుమార్ ,రామానుజుల చిన మధు.సుబ్బారాయుడు హేమలత, పేచెట్టి లక్ష్మీ విమల, పసుపులేటి కుమారి, జ్యోతి తదితరులు. పాల్గొన్నారు.

# ఎస్టి 35 తెగల సమగ్ర స్థితిగతుల కోసం కమిషన్

**– ప్రభుత్వాలకు అఖిల భారత ఆదివాసి ఉద్యోగుల సంఘం వినతి**

**విజయవాడ/ఏలూరు,మేజర్ న్యూస్ :** ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో జాతీయ స్థాయి సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశం అఖిల భారత ఆదివాసి ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు నేతృత్వంలో నిర్వహించబడింది. గిరిజనులుగా పిలవబడే ఆదివాసీల విద్య,వైద్య,ఉపాధి, ఉద్యోగ, ఆరోగ్యం,ఆర్థికం, సామాజిక, రాజకీయ,సాంస్కృతిక,సాహిత్య, వైజ్ఞానిక, మీడియా,సేవ, సాంకేతిక, పరిశోధన, వ్యవసాయ,పారిశ్రామిక,వ్యాపార,వాణిజ్య,రక్షణ, బీమా, సంక్షేమ,తదితర రంగాల్లో వారి స్థితి గతులపై సమగ్రంగా సమీక్షించారు. విభిన్న రంగాల్లో గిరిజనుల వాస్తవ స్థితి గతులను తెలుసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధినేతలైన ప్రధాన మంత్రి ,ముఖ్య మంత్రులు ప్రత్యేక కమిషన్లు ఏర్పాటు చేయాలని సంఘం కోరింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఎస్టీ ఆదివాసీల సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీకగా, ఎస్టీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి వీలుగా 5 ఎకరాలకు పైగా భూమిని కేటాయించి, సమావేశ మందిరాలతో కూడిన బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను కటారి కోటేశ్వరరావు కోరారు. ఆదివాసీల్లోని ప్రతి కులం అన్ని రంగాల్లో సమాంతరంగా వృద్ధిలోకి రావడానికి కులాల సమూహ కార్పొరేషన్లు ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని రమేష్ నాయక్ కోరారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని సంఘం సీనియర్



నాయకులు సాల బోగేశ్వరావు ప్రభుత్వాలను కోరారు.సమావేశంలో జాతీయ నాయకులు వెంకటేశ్వర్లు, బోగేశ్వరావు,వెంకటేష్,విభిన్న బహుజన సంఘాల నాయకులు గుబ్బల నాగేశ్వరావు, నెరుసు నాగమణి యాదవ్,కందికట్ల నరసింహారావు, గుదే రాంబాబు,పెరియార్, పాము రవీంద్రనాథ్, సంఘం రాష్ట్ర నాయకులు గంటిమళ్ళ సత్తిబాబు,దేవర కొండ సాంబశివరావు,శివ బాల నాగరాజు, వివిధ జిల్లాల నాయకులు సురేష్,సుశీల,రమేష్ నాయక్,కలావతి బాయ్,ఎల్లయ్య,రాములు,శంకర్ శ్రీను, గోపినాథ రావు నాయక్, వసంత్‌బీవివిధ నియోజక వర్గాల నాయకులు సునీత ,నాగేశ్వరావు, హిమబిందు, అరుణ కుమారి,సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

# ముద్దాయిలకు శిక్షలు పడేలా సమర్థంగా పని చేయాలి






**– కోర్టు మానిటరింగ్ సభ్యులతో ఎఎస్‌పి సమీక్ష**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్య చంద్రరావు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సమావేశ మందిరంలో శనివారం కోర్టు మానిటరింగ్ సభ్యులతో సమీక్ష సమావేశంను నిర్వహించారు. అదనపు ఎస్పీ అడ్మిన్ ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం సబ్ డివిజన్ లకు చెందిన కోర్టు మానిటరింగ్ సభ్యులతో మాట్లాడుతూ కేసుల విచారణ వేగంగా జరగాలంటే సాక్షులను సమయానికి హాజరు చేయడం అనివార్యమని తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడేలా సమర్థంగా పని చేయాలని సూచించారు. నేరస్తులు శిక్ష తప్పించు కోకూడదని,బాధితులు న్యాయం పొందేలా ఉండాలన్నారు.కోర్ట్ మానిటరింగ్ సెల్ సభ్యులకు జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ సూచనలుప్రతి రోజు కోర్టులో జరిగిన ప్రక్రియను డాక్యుమెంట్ చేసి స్టేషన్ అధికారి స్థాయికి నివేదించాలని సూచించారు. కోర్ట్ మానిటరింగ్ సెల్ సభ్యుల విధి నిర్వహణపై వ్యక్తి గతంగా ప్రతీ ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోర్ట్ మోనటరింగ్ ఇంచార్జి ఇన్స్పెక్టర్ ఎం.సుబ్బారావు (మహిళా పోలీస్ స్టేషన్), డిసిఆర్‌బి ఇన్స్పెక్టర్ హబీబ్ భాషా,కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది.

# మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ ఉద్యోగ సిబ్బంది టూల్స్ డౌన్




**ఏలూరు,మేజర్ న్యూస్ :** క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పరిరక్షణలో వహిస్తున్న నిర్లక్ష్య విధానాలకు వ్యతిరేకంగా శనివారం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ సెక్షన్ ఉద్యోగ సిబ్బంది టూల్స్ డౌన్ కార్యక్రమాన్ని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర పిలుపులో భాగంగా ఏలూరులో ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకత్వంలో ఆర్ ఆర్ పేట ఎస్. ఆర్-2 వద్ద టూల్స్ డౌన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే,జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ అప్పలరాజు,యూని యన్ కోశాధికారి బి నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు కూటమి పార్టీల నాయకులు వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎన్ఎంఆర్ ఉద్యోగ సిబ్బంది నీ పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి అధికారం లోకి వచ్చి సంవత్సరం పూర్తయిన హామీ ని అమలు చేయలేదని వారు ఆరోపించారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ,ఎన్ ఎం ఆర్ లను తక్షణమే పర్మినెంట్ చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.టూల్స్ డౌన్ కార్యక్రమంలో నాయకులు కడుపు కన్నయ్య,ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నారా శ్రీనివాస్,డి వెంకటేశ్వర రావు,కందుల శ్రీనివాస్, గేదెల రవి, సిహెచ్ అమర్నాథ్,టి.కనకరాజు,జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యసహాయకులను ఆదుకోవాలి



**భీమవరం,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖలో ఆరోగ్యసహాయకులను ఉద్యోగాల నుంచి తొలగించి తొమ్మిదో నెలొచ్చింది. ఈ నవమాసాలూ కష్టాలను, కన్నీళ్లనూ తమ కడుపులోనే దాచుకొని అష్టకష్టాలతో బ్రతుకీడుస్తున్న తమను కూటమి ప్రభుత్వమే ఆదుకో వాలని ఆంధ్రప్రదేశ్ పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీ.వీ.వీ.ప్రసాద్ కూటమి నేతలకు కన్నీటి లేఖలు రాసారు. ఇందుకు సంబందించిన వివరాలను భీమవరంలో శనివారం పత్రికల వారికి ప్రసాద్ తెలియ జేసారు.గత డిసెంబర్ 5న తొలగించిన రాష్ట్రంలోని 920 మంది ఆరోగ్య సహాయకుల కుటుంబాల దయనీయ పరిస్థితిని వివరిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయిడుకి, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు మొత్తంగా కూటమి ప్రభుత్వ నేతలకు లేఖలు రాసానని వివరించారు. ఉద్యోగాలు కోల్పోయామన్న బాధ,వేదనతో రాష్ట్రంలో ఇప్పటికే పదిమంది ఆరోగ్యసహాయకులు గుండెలాగిపోయాయని ఆయన గద్గద స్వరంతో తెలిపారు. ముఖ్యమంత్రి స్వయంగా కలుగజేసుకుని, సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఆరోగ్యసహాయకుల ఖాళీల వివరాలన్నిటినీ ప్రభుత్వం కోర్టుకు సమర్పించడమే కాకుండా మెరిట్ ఆధారంగా న్యాయబద్ధంగా అందరినీ తిరిగి నియామకం చెయ్యాలని విన్నవించారు.

## ఘనంగా మహేష్ బాబు పుట్టినరోజు వేడుకలు

**ఇరగవరం మేజర్ న్యూస్ :** ప్రముఖ సినీ నటుడు మహేష్ బాబు పుట్టినరోజు వేడుకలు మండలంలోని కత్తవపాడులో నిర్వహిం చారు. కార్యక్రమంలో మహేష్ బాబు ఫ్రాన్స్ నిర్వాహకులు పాతగొలుసు శ్రీనివాసరావు మాట్లాడుతూ 4700మంది చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్ చేయించిన గొప్పవ్యక్తి మహేష్ బాబు అన్నారు.

సినీ పరిశ్రమలో అగ్రస్థానంలో నిలిచి ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన స్ఫూర్తితో ఎందరో హీరోలు పలు సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని త్వరలో మహేష్ బాబు సేవా సంస్థను స్థాపించనున్నట్లు చెప్పారు. సేవా కార్యక్రమాలు చేయడానికి దాతలు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని కోరారు. త్వరలో కీర్తిశేషులు ఘట్టమనేని కృష్ణ, మహేష్ బాబు విగ్రహాలు నిర్మించానున్నట్లు చెప్పారు.అనంతరం మహేష్ బాబు ఫ్లెక్సీలకు పూలమాలలతో అలంకరించి కేక్ కటింగ్ చేసారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

## మన్నా చర్చి ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే బడేటి చంటి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** స్థానిక శాంతినగర్‌లోని మన్నా చర్చి నందు ప్రత్యేక ప్రార్థనల్లో శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) పాల్గొన్నారు.

ఈడా చైర్మన్ పెద్ది బోయిన శివప్రసాద్ టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, క్లస్టర్ ఇంచార్జ్ ఆర్ ఎన్ ఆర్ నాగేశ్వరరావు కార్పొరేటర్ నన్నపనేని సురేష్ క్లస్టర్ ఇంచార్జ్ గూడవల్లి వాసు మన్నా చర్చ్ బిషప్ ఎలీషా రాజు,పాస్టర్ జ్యోతి రాజు,సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# పెదవేగి పోలీస్ శిక్షణా కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ





**పెదవేగి, మేజర్ న్యూస్:** ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ ,జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్య చంద్రరావు పెదవేగి పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ను రానున్న రోజుల్లో పోలీస్ కానిస్టేబుల్ శిక్షణ ఇచ్చుట కొరకు ఉన్న సదుపాయాలను శనివారం పరిశీలించారు. పోలీస్ ట్రైనింగ్ సెంటర్ నందు ట్రైనింగ్ కల్పించుట కొరకు ఉన్నటువంటి సౌకర్యలను క్షేత్రస్థాయిలో జిల్లా ఎస్పీ అధికారులతో కలిసి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ నిర్వహించడం కొరకు గ్రౌండ్లు ఎలా ఉన్నాయి ,ఎంతమంది వరకు ట్రైనింగ్ ఇవ్వవచ్చును అనే విషయాల పైన, పోలీస్ కానిస్టేబుల్ శిక్షణా తరగతులు గురించి ఏర్పాటు చేసిన తరగత గదులను పరిశీలన చేసి అక్కడ ఉన్న సౌకర్యాలు కంప్యూటర్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ట్రైనింగ్ ఇచ్చే నిమిత్తంగా ఏర్పాటు చేసిన ఏర్పాటులను పరిశీలిన్చారు. సిబ్బంది నివసించుట కొరకు ఉన్న బ్యారెక్స్ ను దాంట్లో ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలను గురించి ప్రత్యేకంగా అధికారులను అడిగి తెలుసుకుని బెడ్స్,స్నానాలు బాత్ రూమ్‌లు పరిస్థితులను గురించి అధికారులకు తగిన సూచనలు సలహాలు ఆదేశాలు జరి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిబ్బందికి భోజనం వసతి హైజినిక్గా ఉండేలాగా,నీటి సదుపాయం సిబ్బందికి వినియోగించడానికి కావలసినటు వంటి మినరల్ వాటర్ గురించి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటుగా పెదవేగి డిస్టిక్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీ ప్రసాద్ ,డిటిసి ఇన్స్పెక్టర్ రామారావు పెదవేగి ఇన్స్పెక్టర్ సిహెచ్ రాజశేఖర్, ఆర్ఐ పవన్ కుమార్, ఎస్ఐలు విజయ కుమార్, ఎస్ఐ శంకర్,పెదవేగి ఎస్ఐ రామకృష్ణ , సిబ్బంది పాల్గొన్నారు

# ఆదివాసి జండా ఎగరవేసిన ఎమ్మెల్యే రోషన్ కుమార్

**చింతలపూడి,మేజర్ న్యూస్ :** చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి గ్రామంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు రోషన్ కుమార్ హాజరయ్యారు, ముందుగా ర్యాలీలో పాల్గొని విగ్రహాలకు పూలమాలవేసి, ఆదివాసి జండా ఎగరవేశారు. ఆ తర్వాత ఏర్పాటు చేసినకార్యక్రమంలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర, తెలంగాణ నుంచి నాయక్ పోడు నాయకులు ప్రజలు,చింతలపూడి మండలం పట్టణ కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# దేశ భవిష్యత్తుకు డిజిటల్ టెక్నాలజీలే ప్రధాన చోదక శక్తి





**- ఘనంగా ఏపీ నిట్ 7వ స్నాతకోత్సవం**

**తాడేపల్లిగూడెం, మేజర్‌న్యూస్ :** దేశ భవిష్యత్తుకు డిజిటల్ టెక్నాలజీలే ప్రధాన చోదక శక్తిగా మారనున్నాయని సాఫ్ట్ వేర్ అండ్ సర్వీసెస్ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రసిడెంట్ వి.రాజన్న సూచించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లో విద్యనభ్యసించిన 2021-2025 బ్యాచ్ విద్యార్థులకు ఏడో స్నాతకోత్సవాన్ని ప్రాంగణంలోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి.రమణారావు అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిధి రాజన్న మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువ ఇంజనీర్లేనని తెలిపారు. ప్రపంచంలో నాల్గవ ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించబోతుందన్నారు. డిజిటల్ లావాదేవీల్లో భారత్ ప్రపంచ అగ్రగామిగా ఉందన్నారు. 97 కోట్లు ఇంటర్నెట్ కనెక్షన్లు, యూపిఐ వంటి ప్లాట్ఫామ్ లు ఏటా 100 బిలియన్లకు పైగా లావాదేవీలు నిర్వహిస్తుందని చెప్పారు. అధ్యక్షత వహించిన ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి.రమణారావు మాట్లాడుతూ దేశం గర్వించే రీతిలో విద్యార్థులు వినూత్న పరిశోధనలు, ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. నిట్ ఆంధ్రప్రదేశ్లో విద్యార్థులు సంపాదించుకున్న జ్ఞానం,ఆధునిక నైపుణ్యాలు వారు జీవితాల్లో ముందడుగు వేయడానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. సంస్థ పురోగతి నివేదికను అందజేశారు. అనంతరం 2021-2025 బ్యాచ్‌లో బీటెక్ నాలుగేళ్ళ ఇంజినీరింగ్ కోర్సును పూర్తిచేసుకున్న 667 మంది విద్యార్థులకు డిగ్రీలు,పిహెచ్డి పూర్తిచేసిన 29 మంది పరిశోధన విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను ప్రధానం చేశారు. వీరితోపాటు కోర్సులవారీగా అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన బయో టెక్నాలజీ ఇంజినీరింగ్ నుంచి శశాంక్ 9.33 గ్రేడ్ పాయింట్లు, కెమికల్ ఇంజనీరింగ్ నుంచి సంగెపు అభినవ్ 8.82 గ్రేడ్ పాయింట్లు,సివిల్ ఇంజనీరింగ్ నుంచి తమ్ము హరిత 9.44 గ్రేడ్ పాయింట్లు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ నుంచి కలిదిండి పవన్ తేజ సత్య వర్మ 9.70 గ్రేడ్ పాయింట్లు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ నుంచి ఆదిత్య ప్రతాప్ సింగ్ 9.42 గ్రేడ్ పాయింట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ నుంచి చిత్తిడి ధనుషా లక్ష్మి దుర్గ 9.48 గ్రేడ్ పాయింట్లు, మెకానికల్ ఇంజనీరింగ్ నుంచి వుడుముడి ప్రియాంక 9.33 గ్రేడ్ పాయింట్లు, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ నుంచి జయస్మిత కే ప్రధాన్ 9.07 గ్రేడ్ పాయింట్లు సాధించారు. వీరందరికి బంగారు పతకాలు అందజేయటంతోపాటు బ్యాచ్ లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన కలిదిండి పవన్ తేజ సత్య వర్మ ఇనిస్టిట్యూట్ తరుపున, కోర్సు వారీగానూ రెండు బంగారు పతకాలను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి,డీన్‌లు డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి,డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ హిమబిందు, సెనేట్ సభ్యులు, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

## రైతు మనుగడ కోసం ఉద్యమాలే మార్గం

**- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు వల్లే రైతుల ఆత్మహత్యలు**
**- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ విమర్శ**



**జీలుగుమిల్లి ,మేజర్ న్యూస్ :** వ్యవసాయంలో రైతు మనుగడ కోసం ఉద్యమాలే మార్గమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు.శనివారం జీలుగుమిల్లి, సుందరయ్య కాలనీలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల మహాసభ సంఘం మండల అధ్యక్షులు దాసరి జానకిరామి రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. మహాసభ ప్రారంభ సూచకంగా రైతు సంఘం జెండాను తాళ్లూరి సూర్యారావు ఆవిష్కరించారు.ముఖ్యఅతిథిగా విచ్చేసిన కె.శ్రీనివాస్ మాటాడుతూ నేడు వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉందని, నష్టాల్లో కూరుకుపోతున్న అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కష్టపడి పండించిన ఏ ఒక్క పంటకు కనీస మద్దతు ధరలు రావడం లేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతు పెట్టిన పెట్టుబడికి అదనంగా 50శాతం కలిపి మద్దతు ధరలు వస్తేనే రైతుకు వ్యవసాయంలో మనుగడ ఉంటుందన్నారు.వర్జినీ య పొగాకు,ఆయిల్ పామ్,మిర్చి,మొక్క జొన్న,కోకో తదితర పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. సన్న చిన్న కారు పేద రైతులకు వడ్డీ లేని పంట రుణాలు ఇవ్వాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి సిరి బత్తుల సీతారామయ్య, సిఐటియు మండల కార్యదర్శి చిట్టి బొమ్మ కొండలరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కారం నాగదుర్గ మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి రైతాంగ సమస్యలపై పోరాటాలు చేయాలని కోరారు.ఈ మహాసభలో సుంకవల్లి శేషగిరిరావు,బొంతు వెంకటేశ్వరరావు, తాళ్లూరి సూర్యారావు, దాసరి రామారావు,చోడెం కన్నప్ప రాజు, పాయం లక్ష్మణరావు, జక్కుల వెంకటేశ్వరరావు,ఎం. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తమ్మిలేరు భూములు ఆక్రమించుకుంటున్న వారిపై చట్టపరమైన చర్యలు

**- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్**



**ఏలూరు రూరల్,మేజర్ న్యూస్ :** తమ్మిలేరు భూములు అన్యాక్రాంతమవుతున్న ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆరోపించారు. శనివారం ఏలూరు రూరల్ మండలం చోదిమెళ్ళ గ్రామంలో ఎఫ్‌సిఐ గోడంల వద్ద తమ్మిలేరు భూమిని కొంతమంది భూస్వాములు ఇనుప కంచెలు వేసి దుక్కి దున్ని ఆక్రమించుకోవడం జరిగిందన్నారు. ఇది ప్రభుత్వ భూమి దీని ఆక్రమించుకున్న వారిపైన ప్రభుత్వం తమ్మిలేరు ఇరిగేషన్ అధికారులు స్పందించాలని కోరారు. ఇప్పటికే తమ్మిలేరుకు అనుకొని ఉన్న వేలాది ఎకరాల భూములను భూస్వాములు అక్రమంగా ఆక్రమించుకొని దర్జాగా అనుభవిస్తున్నారని తెలిపారు. కానీ ప్రభుత్వం ఏమీ పట్టించుకోవడంలేదని,చాప కింద నీరులా వాళ్ళు భూములు ఆక్రమించు కుంటుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు.పేదలకు ఒక రకమైన చట్టం భూస్వాములకు,పెద్దలకు మరో రకమైన చట్టం అమలు చేస్తున్నారా అని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా ఈ భూమిని ఆక్రమించుకున్నారో వారి నుండి ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.